క్లుప్తంగా

అక్రమంగా మట్టి తరలింపు

మానవపాడు: ప్రభుత్వ అనుమతులు లేకుండా కొందరు నాయకులు మండలంలోని పెద్దపోతలుపాడు శివారు ప్రాంతం నుంచి అక్రమంగా మొరం మట్టిని తరలిస్తున్నారు. అయినా అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మను వివరణ కోరగా.. అనుమతులు లేకుండా ఎవ్వరూ అక్రమంగా మొర్రం తరలించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుత్ అంతరాయం

మానవపాడు: మండల కేంద్రంలో శనివారం విద్యుత్ అంతరాయంతో ప్రభుత్వ కార్యాలయాల్లో పౌరులకు అందించే సేవలు నిలిచిపోయాయి. రెవెన్యూ, ఎంపీడీఓ కార్యాలయాల్లో రెండు గంటల సేపు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ఘటనపై విద్యుత్ ఏఈ సుబ్బరాయుడును వివరణ కోరగా.. మండలకేంద్రంలోని గాంధీచౌక్ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె మరమ్మతులు నిర్వహిస్తున్నామని, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు సరిచేస్తున్న కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడిందని తెలిపారు.

కార్మికుల ముందస్తు అరెస్ట్



అయిజ: చలో సీడీఎంఏ కార్యాలయం ముట్టడికి తరలివెళ్తున్న మున్సిపల్ కార్మికులను శనివారం స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గట్టన్న, కోశాధికారి మహేష్ కుమార్, శివ, రవి తదితరులు ఉన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ పెండింగ్ బిల్లులు చెల్లించాలి



అలంపూర్: పట్టణంలోని హైస్కూల్‌లో యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల బిల్లులను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 1న జిల్లా కేంద్రంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో రాముడు, బయన్న, శ్రీనివాసులు, రమణారెడ్డి, రాజ్‌కుమార్, ఎల్లకృష్ణ, మధునాయుడు, సురేష్, ఈదన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

‘పేదల సొంతింటి కల నెరవేరింది’

మానవపాడు: కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలు సొంతింటి కలను సాకారం చేసుకునే అవకాశం ఇచ్చిందని డీసీసీ జనరల్ సెక్రెటరీ మహ్మద్ సిరాజ్ తెలిపారు. శనివారం మండలంలోని అమరవాయిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మార్కింగ్, భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో అబ్దుల్‌రహ్మాన్, గాండ్ల రమేష్, జగదీష్‌గౌడ్, బోయ జయన్న, బోయ రాఘవేంద్ర, మహబూబ్, జౌహర్, అబ్దుల్ పాల్గొన్నారు.

మద్యం తాగొద్దనందుకు వ్యక్తిపై దాడి

ఉండవెల్లి: మద్యం తాగొద్దని సూచించిన వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని పుల్లూరు టోల్‌ప్లాజాలో ఉన్న హర్ష హోటల్‌ను కంచుపాడుకు చెందిన విక్రమాచార్యులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 23న రాత్రి కర్నూల్‌కు చెందిన జగదీష్, జయంత్, సోయల్ హోటల్‌లో మద్యం తాగడానికి వచ్చారు. ఇక్కడ మద్యం తాగరాదని సూచించిన హోటల్ యజమాని విక్రమాచార్యులుపై వారు దాడి చేశారు. విక్రమాచార్యులు భార్య విజయలక్ష్మి, పక్క హోటల్ వ్యక్తి రావడంతో గొడవ సద్దుమణిగింది. హోటల్ యజమాని ఫిర్యాదు మేరకు ముగ్గురిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

రూ.లక్షలు వెచ్చించినా నిరుపయోగంగా..

ఉండవెల్లి: మండలంలోని బొంకూరు గ్రామంలో గత ప్రభుత్వం రూ.2.5లక్షలు ఖర్చు చేసి సెగ్రిగేషన్ షెడ్డు నిర్మించారు. కానీ అక్కడ తడి, పొడి చెత్తను వేరు చేయడం లేదు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్లకు మ్యాపులు వేస్తున్న క్రమంలో కొన్ని నెలలుగా పంచాయతీ అధికారులు సెగ్రిగేషన్ షెడ్డును పట్టించుకోవడం లేదు. సెగ్రిగేషన్ షెడ్డు రేకులు, బాత్రూంకు ఉన్న తలుపు గుర్తు తెలియని వారు తీసుకెళ్లినా ఎలాంటి పట్టింపు లేదు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన షెడ్డుకు భద్రత లేకుండా పోయిందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సెగ్రిగేషన్ షెడ్డును వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

బస్సు రాదు.. నడక తప్పదు



నాగర్‌దొడ్డి నుంచి స్టేజీ వరకు కాలినడకన వస్తున్న మహిళలు

- రోడ్డు సౌకర్యం ఉన్నా.. బస్సులు సర్వీస్ లేదు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

మల్దకల్: ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం కల్పించినప్పటికీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శనిలా ఉందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. మండలంలోని సద్దలోనిపల్లి నుంచి నేతువానిపల్లి వరకు 13ఏళ్ల క్రితం కోటి రూపాయలతో బీటీ రోడ్డు ఏర్పాటు చేశారు. కుర్తిరావులచెర్వు నుంచి అయిజ రోడ్డు వరకు, తాటికుంట నుంచి స్టేజీ వరకు, నాగర్‌దొడ్డి నుంచి అయిజ స్టేజీ వరకు, దాసరపల్లి నుంచి బిజ్వారం వరకు, పెద్దపల్లి నుంచి ఎల్కూరు, మల్దకల్, అమరవాయి నుంచి బిజ్వారం వరకు బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు నిత్యం వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే అదనుగా భావించిన ప్రైవేట్ వాహనదారులు, అధిక చార్జీలు వసూలు చేయడంతో పాటు పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తున్నారు. ప్రజలు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. వ్యవసాయ పనుల కోసం ఆయా గ్రామాలకు చెందిన రైతులు వివిధ పనుల నిమిత్తం వెళ్లేందుకు ప్రతిరోజు 3కి.మీ.ల మేర కాలినడకన వెళ్లివస్తున్నారు. వృద్ధులు, పిల్లలు, మహిళలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు సౌకర్యం ఉన్న గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు సౌకర్యం ఉన్న బస్సు సౌకర్యం లేని కుర్తిరావల్‌చెర్వు

బస్సు సౌకర్యం కల్పించాలి



సద్దలోనిపల్లి స్టేజీ నుంచి నేతువానిపల్లి వరకు బస్సు సౌకర్యం కల్పించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. అద్దంలాంటి రోడ్డున్న ఆర్టీసీ బస్సులు తిరగకపోవడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. గ్రామం నుంచి సద్దలోనిపల్లి స్టేజీ వరకు కాలినడకన వెళ్లి బస్సులు ఎక్కి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– లవన్న, సద్దలోనిపల్లి

అధికారులు పట్టించుకోవడం లేదు..



మల్దకల్ నుంచి కుర్తిరావుల చెర్వు మీదుగా అయిజ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ప్రతినిత్యం వివిధ పనుల నిమిత్తం అయిజ–గద్వాలకు వెళ్లేందుకు 4కి.మీ.ల దూరం కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాఠశాలలు, కళాశాలల సమయంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– బుడ్డన్న, కుర్తిరావల్ చెర్వు

చర్యలు తీసుకుంటాం..



రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సు సౌకర్యం లేని గ్రామాలను పరిశీలించి బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తాం. ఆయా రూట్లకు బస్సు సర్వీసులు కొనసాగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

– సునీత, డిపో మేనేజర్, గద్వాల

కొనసాగుతున్న అఖండ సప్తాహ భజన



అయిజలో ఎడ్లబండ్లతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు



ఆదిశిలా క్షేత్రంలో..

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అఖండ సప్తాహ భజనలు కొనసాగుతున్నాయి. శనివారం కర్ణాటకకు చెందిన శేషదాసుల వారి శిష్యబృందం గంగాఖేడ్, వెంకటేశ్వర్లు, నారాయణరావు, నరేంద్రతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భజన మండలి సభ్యులు భజనలు చేశారు. వారం రోజుల పాటు కొనసాగనున్న ఈ సప్తాహ భజనల కార్యక్రమాలను తిలకించేందుకు భజన మండలి సభ్యులు, భక్తులు హాజరవుతున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సత్యచంద్రారెడ్డి, అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, వీరారెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నందిన్నె ప్రకాష్‌రావు, శశాంక్, వరదేంద్ర, వెంకోబరావు, ఆనంద్, ప్రహ్లాదాచారి, రాఘవేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాసం పూజలు

అయిజ: శ్రావణ శనివారాన్ని పురస్కరించుకొని మండలవ్యాప్తంగా ఆలయాల్లో అర్చకులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి అయిజ శివారులోని కట్టకింది తిమ్మప్పస్వామి ఆలయం వరకు భక్తులు మేళతాళాలతో, మంగళ వాయిద్యాలతో ఎడ్ల బండ్ల (ఫలహారం బండ్లు)తో ఊరేగింపుగా వెళ్లారు. మహిళలు మంగళ హారతులు పట్టి ఊరేగింపులో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



మల్దకల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ స్వరూపరాణి

మల్దకల్: విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ స్వరూపరాణి సూచించారు. శనివారం కస్తూర్బా బాలికల పాఠశాల, ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ విద్యార్థులు భోజనానికి ముందు, భోజనం తర్వాత చేతులను శుభ్రపరచుకోవాలని కోరారు. వర్షాకాలంలో సీజనల్‌గా వచ్చే వ్యాధులతో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఉండవెల్లి: మండలంలోని పులూరులోని మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మానవపాడు పీహెచ్‌సీ వైద్యురాలు హేమమానస ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. శనివారం వైద్యాధికారులు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవానందం, వైద్య సిబ్బంది చంద్రయ్య, అక్కమ్మ, వీణసాయి, అబేదుల్ల, చంద్రన్న, రాణి, ప్రసన్న, కృష్ణవేణి, ఆశాలు పాల్గొన్నారు.

మతరాజకీయాలు ప్రమాదకరం

గద్వాల: మతరాజకీయాలతో దేశాభివృద్ధికి విఘాతం ఏర్పడుతుందని, ప్రజాస్వామ్యం మనుగడ ప్రమాదంలో పడుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో సగటు జాతీయ ఆదాయంలో 80శాతం ఆదానీ, అంబానీ వంటి కుబేరుల చేతుల్లో కేంద్రీకృతం అవుతుందన్నారు. దీనిఫలితంగా వ్యవస్థలో ప్రజల మధ్య తీవ్రమైన ఆర్థిక సంక్షోభం నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ప్రజల మధ్య అంతరాలు పెంచేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఆగస్టు 7, 8 తేదీల్లో గద్వాలలో జిల్లా నిర్వహించే సీపీఐ మూడో మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గద్వాల మండలం సీపీఐ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శి ఖాసీం, సహాయకార్యదర్శులుగా వెంకటేష్, వెంకట్రాముడు, ఖాదర్‌పాషా, వెంకటేష్, కార్యవర్గ సభ్యులుగా ఏడుమందిని, కౌన్సిల్ సభ్యులుగా 15మందిని ఎన్నుకున్నట్లు ఖాసీం తెలిపారు. కార్యక్రమంలో రంగన్న, ఆశన్న, వెంకటేష్, వెంకట్రాముడు, ఖాదర్‌కృష్ణ, పరమేష్, శేషన్న, మస్తాన్, ధర్మన్న, ప్రభుదాసు, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి



కేటీదొడ్డి: విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కస్తూర్బా విద్యాలయాల జిల్లా ఇన్‌చార్జ్ హంపయ్య సూచించారు. శనివారం కేటీదొడ్డి కేజీబీవీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వంటశాలలో భోజన తయారీ, కూరగాయలను పరిశీలించడంతో పాటు విద్యార్థుల సామర్థ్యలను పరీక్షించారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కేజీబీవీలో నిర్మాణం చేపట్టే పనులపై ఏఈ మోహన్‌రెడ్డిను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓ పద్మావతి, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల



అయిజ: గట్టు మండలంలోని ముచ్చోనిపల్లిలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఈ నెల 30న ఆవిష్కరించనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు ఆంజనేయులు మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ చేతుల మీదుగా అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరిస్తున్నామని, ప్రజలు భారీ ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాజు, తిమ్మన్న, ప్రసాద్, కిష్టన్న, తిమ్మప్ప, దేవేందర్, భాస్కర్, వీరేష్, మోషన్న, అశోక్, ప్రసాద్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని అభివృద్ధి పథంలో నడపాలి



అయిజ: ఆర్టీసీ శాఖను అభివృద్ధి పదంలో నడిపేందుకు కృషిచేద్దామని ఆర్టీసీ డిపో మేనేజర్ సునీత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాన్ని, పరిసర ప్రాంతాలను డిపో మేనేజర్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల కేంద్రంలో గతంలో నిర్మించిన ప్రయాణ ప్రాంగణం చిన్నదిగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని, ఇప్పుడున్న నాలుగు ప్లాట్‌ఫాంలకు అదనంగా మరో రెండు ప్లాట్ ఫాంలు నిర్మించేందుకు ప్రణాళిక తయారుచేసినట్లు తెలిపారు. ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలోని మైదానంలో సీసీ బెడ్ వేసేందుకు కృషిచేస్తామని అన్నారు. అనంతరం పాతబస్టాండ్‌లో దాతలు నిర్మించిన బస్ షెల్టర్‌ను పరిశీలించారు. అదేవిధంగా కర్నూలు–రాయచూరు రోడ్డు పక్కన చౌరస్తాలో మున్సిపాలిటీ వారు నిర్మించిన బస్ షెల్టర్‌ను పరిశీలించారు. బస్ షెల్టర్ అసంపూర్తిగా ఉందని, వసతులు కల్పించి దాన్ని ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు కృషిచేస్తామని అన్నారు. తీర్థయాత్రలకు వెళ్లేందుకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షితంగా ప్రయాణం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ కంట్రోలర్ పర్వత రెడ్డి, డిప్యూటి సూపరిండెంట్ సునిల్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

గద్వాల: రైతుల కోసం అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధులు అన్నారు. శనివారం మండలంలోని పరమాలలో రైతు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలు, రైతు చట్టాలు, భూముల రక్షణ, రైతుబీమా, న్యాయసహాయం వంటి అంశాలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు వి.రాజేందర్, శ్రీనివాసులు, లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే జీవ మనుగడ



ఉప్పల క్యాంపు గ్రామంలో మొక్క నాటుతున్న మార్కెట్‌యార్డ్ చైర్మన్ దొడ్డెప్ప



మానవపాడులో..

అయిజ: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని, జీవ మనుగడకు మొక్కలు ప్రధానమని అలంపూర్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడెప్ప అన్నారు. శనివారం మండలంలోని ఉప్పల క్యాంప్ గ్రామంలో అధికారులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన అలంపూర్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెప్ప, స్థానిక ఎస్ఐ శ్రీనివాస్‌రావు చేతుల మీదుగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ తిమ్మప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ

మానవపాడు: వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో ప్రతి ఇంటికి ఒక మొక్కను అందించామని పంచాయతీ కార్యదర్శి శివశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇంటికో మొక్క నాటి, వాటిని పెంచే బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి



కేటీదొడ్డి కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులకు మెటీరియల్స్ అందజేస్తున్న రత్నసింహారెడ్డి

కేటీదొడ్డి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకొని, పట్టుదలతో సాధించాలని హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వ్యవస్థాపకుడు రత్నసింహారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ఇర్కిచేడు, పాతపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా మెటీరియల్‌ను జిల్లా సెక్టోరియల్ అధికారి హంపయ్య, ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంతో ట్రస్టులు దోహదం చేస్తున్నాయన్నారు. పాఠ్యాంశాలపై ఆసక్తిని పెంపొందించుకొని సమాజానికి ఉపయోగపడేలా విద్యను ఆచరణలో పెట్టాలని సూచించారు. అనంతరం రత్నసింహారెడ్డి మాట్లాడుతూ అనంతమ్మ, వేమారెడ్డి జ్ఞాపకార్థం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఓ పద్మావతి, సీఆర్పీ శివరాజ్, వీరారెడ్డి, కొండయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.



మార్లబీడులో..

పరీక్షల పరిశీలన

ధరూరు: మండలంలోని మార్లబీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎఫ్ఏ–1 పరీక్షలను ఎంఈఓ రవీంద్రబాబు పరిశీలించారు. శనివారం ఆయన డీసీఈబీ సెక్రెటరీ ప్రతాప్‌రెడ్డితో కలిసి పాఠశాలకు చేరుకుని విద్యార్థులు రాస్తున్న పరీక్షలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులను పరిశీలించారు.

షరతులు లేకుండా నగదు జమ చేయాలి



దువాసిపల్లిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న నాయకులు

ఎర్రవల్లి: ఇందిరమ్మ ఇళ్ల పనిని ప్రారంభించిన ప్రతి లబ్ధిదారుడికి ఎలాంటి షరతులు లేకుండా బిల్లులను మంజూరు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. శనివారం మండలంలోని దువాసిపల్లిలో ఆ పార్టీ నాయకులతో కలిసి లబ్ధిదారులు నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పునాది వరకు నిర్మిస్తేనే రూ.లక్ష అకౌంట్‌లో జమ చేస్తామని చెప్పడం సరి కాదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం మార్కింగ్ చేసిన ప్రతి ఒక్క లబ్ధిదారుడికి మొదటగా రూ.లక్ష జమ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మణికుమార్, రాములు, వడ్డే కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

‘లెసన్ ప్లాన్‌ను అనుసరించి బోధన చేయాలి’

ధరూరు: ప్రతి ఉపాధ్యాయుడు అను నిత్యం టీచర్స్ డైరీ రాసుకోవడంతో పాటు లెసన్ ప్లాన్‌ను అనుసరించి తరగతి గదిలో విద్యా బోధన చేయాలని డీసీఈబీ సెక్రెటరీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మార్లబీడులో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పిల్లల యొక్క గ్రహణ స్థాయిని, ఏఐ ఆధారిత బోధన చేయాలన్నారు. పిల్లలు పాఠశాలలో ఉన్న లైబ్రరీని విస్తృతంగా వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఎంఈఓ రవీంద్రబాబు మాట్లాడుతూ.. ఎఫ్‌ఆర్‌ఎస్‌ను ప్రతి రోజు 100 శాతం పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థుల ఇళ్లను ప్రతి ఉపాధ్యాయుడు సందర్శించి, వారికి సంబంధించిన రికార్డును అప్‌డేట్ చేసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న డీసీఈబీ సెక్రెటరీ ప్రతాప్‌రెడ్డి

అమర జవాన్లకు నివాళి

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలోని విద్యార్థులు కార్గిల్ దివాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆర్మీ జవాన్ల విన్యాసాలతో అలరించారు. అనంతరం విద్యార్థులు అమరులైన ఆర్మీ జవాన్లకు నివాలర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎలిజబిత్ సుహాసిని, పీఈటీ అరుణతారా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పచ్చదనానికి గొడ్డలి పెట్టు..



హరితహారంలో భాగంగా అధికార యంత్రాంగం పెద్ద ఎత్తున మొక్కలను నాటుతుంటే.. మరోవైపు రోడ్డు పక్కన పొలాలు ఉన్న రైతులు వాటిని పొలాలకు అడ్డుగా భావించి నరికేస్తున్నారు. గట్టు నుంచి మల్దకల్ వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా గతంలో నాటిన మొక్కలు పెరిగి ఆహ్లాదకరంగా కనువిందు చేస్తున్నాయి. అయితే రోడ్డు పక్కన పొలాలను సాగు చేసుకుంటున్న కొంతమంది రైతులు చెట్లను నరికేస్తున్నా, ఇదేమిటని ప్రశ్నించే వారు కరువయ్యారు. దీంతో రోడ్డు పక్కన పచ్చగా ఉన్న చెట్లు మరికొన్ని రోజుల్లో పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి చెట్లను నరుకుతున్న రైతులకు అవగాహన కల్పించి, రోడ్డు పక్కన చెట్లను తొలగించకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

– గట్టు